ముఖచిత్రం

## అన్నమయ్య సారస్వత క్షీరసాగరం:

# "జయ జయ రామా"

పల్లవి:

జయ జయ రామా సమర విజయరామా
భయహర నిజభక్త పారీణ రామా

చరణాలు:

జలధి బంధించిన సౌమిత్రి రామా
సెలవిల్లు విరచిన సీతారామా
అల సుగ్రీవు నేలిన అయోధ్య రామా
కలిగి యజ్ఞము గాచే కౌసల్య రామా

అరి రావణాంతక ఆదిత్యకుల రామా
గురు మౌనులను గాచే కోదండరామా
ధర నహల్యా పాలిటి దశరథ రామా
హరురాణి నుతుల లోకాభిరామా

అతి ప్రతాపముల మాయామృగాంతక రామా
సుత కుశలవ ప్రియ సుగుణ రామా
వితత మహిమల శ్రీ వెంకటాద్రి రామా
మతిలోనఁబాయని మనువంశ రామా

*[తి.తి.దే. సం. IX. సంకీ. 11]*

ఏనాడు వాల్మీకి కరుణరసహృదయం కరగి రామాయణ కావ్యలహరిగా ప్రవహించిందో ఆనాటి నుండి మానవజాతి రామకథా శ్రవణానందకందళిత హృదయారవిందాలతో పునీతమైంది. మను వంశసుధాంబుధి సోముని ఎన్నిమార్లు పిలిచినా తనివితీరదు.

అది కన్నతల్లి కౌసల్య పిలుపు. తండ్రి దశరథుని పిలుపు. అది వసిష్ఠుని పిలుపు. కౌశికుని పిలుపు. అది సౌమిత్రి పిలుపు. సీతమ్మ బంగారు పిలుపు. అది గుహుని పిలుపు. శబరి పిలుపు. జటాయువు పిలుపు. అది పవనపుత్రుని పిలుపు. సుగ్రీవుని పిలుపు. అది విభీషణుని పిలుపు. దశకంఠుని పిలుపు. అది కొన్ని కోట్ల భారతీయుల పిలుపు. అది అన్నమయ్య గుండె లోతులలోని పిలుపు.

సమర విజయుడైన రాముడు ఆశ్రితులకు భక్తులకు అభయ మివ్వడంలో పారమును ముట్టినవాడు. వేంకటాద్రి మీద నిలిచిన ఈ రాముడు శరణాగత వత్సలుడు.

అనుజ సౌమిత్రితో కలసి సేతుబంధనం చేసి లంక ప్రవేశించిన రాముడు సౌమిత్రి రాముడు. శివధనుస్సును విరిచి సీతను పెండ్లాడి సీతారాము డైనాడు. వాలిని శిక్షించి సుగ్రీవుని రక్షించినవాడు అయోధ్య రాముడు. పదహారేండ్లు కూడా నిండనినాడే కౌశికుని యాగాన్ని కాపాడినవాడు కౌసల్యరాముడు. లోకవిద్రావణుడైన రావణుని పరిమార్చినది రవికుల రాముడే. అసురలను హతమార్చి గురుమౌనులను కాపాడిన వీరరసావతారుడు కోదండరాముడే. గౌతమ శాపహతయైన అహల్యాపాలిటి వరం దశరథరాముడు. లోకమాత పార్వతి స్తుతులచే రాముడు లోకాభిరాము డైనాడు. మాయావియైన మారీచుని హతమార్చినవాడు ['మాయ' అనే మృగాన్ని అంతం చేయగల పరమాత్ముడు] శ్రీరామచంద్రుడే. కుశలవులను కన్న తండ్రి సుగుణాభిరాముడు కాక మరేమి. ఆ కవలు కన్న తండ్రి అయిన రామభద్రుని గుణాలనే గానం చేశారు. మన మనోమందిరాలలో నిలిచింది రఘుకుల రాకానిశాకరుడే. ఆ రాముడు ఎవ్వడైనా, ఎక్కడివాడైనా మా వేంకటాచలానికి రాక తప్పదు. మా అన్నమయ్య 'వేంకట' ముద్ర వేసుకోక తప్పదు.

సెలవిల్లు: సెలను విల్లు. సెలను బద్దలతో చేసిన విల్లు. సెలను ఒక రకమైన చెట్టు. "వీక కలిగిన తడవిల్లు వెదరు విల్లు సెలన విల్లు మొదలైన చేగవిండ్లు చులకగాఁదీసి" [కాళహస్తి. 3-43] అరిరావ...రామా: శత్రువైన రావణాసురుని అంతము చేసిన రాముడు సూర్యవంశానికి చెందిన రాజు. అగస్త్యులవారు బోధించిన ఆదిత్య హృదయాన్ని స్మరించిన తరువాతనే రాములవారు రావణుని వధించడం. గురు...రామా: పూజ్యులైన పెద్దలను, మహర్షులను కాపాడే కోదండరాముడు. రాముడు శిష్టరక్షణకే కోదండరాముడైనాడు. ధర...రామా: అహల్య పాపం చేసింది. భర్త శపించాడు. రామయ్య పదరజం సోకేంతవరకు ఆమెకు రూపమే లేదు. హరురాణి...రామా: పార్వతీదేవి స్తోత్రాలకు పాత్రుడైనవాడు. విష్ణు సహస్రనామంలో శివపార్వతుల సంవాదం ఇలా-'పార్వత్యువాచ కేనోపాయేన లఘునా విష్ణోర్నామ సహస్రకమ్, పఠ్యతే పండితైర్నిత్యం శ్రోతు మిచ్ఛా మ్యహం ప్రభో! ఈశ్వర ఉవాచ, 'శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే, సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే! రామనామ జపంతో పార్వతి సర్వమంగళ అయినదట. అతి...రామా: రావణునికి వెరచి మారీచుడు బంగరు లేడి రూపంతో రాముని వంచించాడు. [పరమాత్ముని ఎదుట నిలువలేక మాయ పటాపంచలైనది] ఒంటరిదైపోయిన సీతను దశకంఠుడు ఎత్తుకొనిపోయాడు. శ్రీ వేంకటాద్రి రామా: తిరుమల శ్రీవారి సన్నిధిలో రామయ్య ఉత్సవమూర్తి ఉన్నది, సీతాలక్ష్మణ హనుమ సమేతంగా. కాని రాములవారికి ప్రత్యేకంగా ఆలయం లేదు. ప్రస్తుతం ఈ రఘునాథుని నిత్యదీపారాధనకు గాను విద్యానగర సైన్యాధిపతి అయిన పెరియ ఓబళనాయకర్ రామానాయకర్ అను నాతడు కడలూరు గ్రామాన్ని సమర్పించినట్లు శా.శ. 1426 నాటి శాసనం తెలుపుతున్నది.

అన్నమయ్య ద్విపద రామాయణం రాశాడట. వాల్మీకి రామాయణాన్ని రాగంతో అనురాగంతో గానం చేశాడట. వారి ద్విపద రామాయణం మనకు లభించలేదు. వారి గానం మిగులలేదు గాని వారు గానం చేసిన రామ సంకీర్తనలు మాత్రం కేవలం శబ్దపంజరాలుగా మిగిలాయి. అన్నమయ్య రామయ్య వేంకటేశ్వరుడే.

-కామిశెట్టి శ్రీనివాసులు

మినీ కథ

## [illegible]

కె.ఆదర్శ సామ్రాట్

రాంబాబు ఉలిక్కిపడి నిద్ర లేచాడు.

రాత్రి రెండు కావస్తోంది.

పక్కింటి నుంచి ఆ వింత శబ్దం మరింత భీకరంగా వినిపిస్తూంది.

ఈ శబ్దాలు వినిపించడం మొదలై సరిగ్గా వారం రోజు లౌతూంది. ఆ ఇంట్లోకి కొత్త శాస్త్రీ దిగి కూడా అన్నే రోజు లౌతూందేమో! అప్పటి నుంచి రాంబాబుకి సరిగ్గా నిద్ర పట్టడం లేదు.

నీళ్ళు తాగి మళ్ళీ పడుకుందామని చూసిన రాంబాబుకి ఫ్లాష్‌లా ఒక ఆలోచన వచ్చింది. దిగ్గున లేచి కూర్చున్నాడు.

అవును. అదే నిజమై ఉంటుంది. పక్కింటి శాస్త్రీ అచ్చం 'డాకూ' లాగే ఉంటాడు. వచ్చి వారం వారం రోజు లౌతున్నా ఏం పని చేస్తాడో వీథిలో ఎవ్వరికీ చెప్ప లేదు. పొద్దున్నే ఎనిమిదింటికి నల్లని కళ్ళద్దాలు పెట్టుకుని, చిన్న సూట్‌కేసు పట్టుకుని వెళ్ళిపోతాడు. రాత్రి ఎప్పుడొస్తాడో ఎవరికీ తెలీదు. కాబట్టి తను అనుకుంటున్నట్టే అతను రాత్రంతా కూర్చుని...

రాంబాబు ఇక నిద్ర పోలేక పోయాడు. తెల్లవారుతూనే హడావుడిగా పోలీస్ స్టేషన్‌కి పరిగెత్తాడు. మరో గంట తరువాత పోలీసులు రాంబాబు పక్కింటి మీద 'దాడి' జరిపారు.

"ఏం జరిగినది సార్?" అన్న 'డాకూ'ని "షటప్!" అని గద్దించాడు ఎస్సై.

నలుగురు పోలీసులు, ఎస్సై, రాంబాబు కలిసి గంటసేపు ఆ ఇల్లంతా వెతికినా ఏమీ దొరక లేదు.

"డాకూ" గుర్రుపుగించి కూర్చుండి పోయాడు.

వెతికి వెతికి విసిగిపోయిన ఎస్సై వెళ్ళిపోబోతూ డాకూని గద్దించాడు -

"చూడండి. మీ ఇంట్లో అచ్చు యంత్రం ఉందనీ, రాత్రి పూట మీరు రహస్యంగా దొంగ నోట్లు అచ్చు వేసి పొద్దున్నే సూట్‌కేస్‌లో పెట్టుకుని చలామణీ చేస్తున్నారనీ మాకు కంప్లైంట్ వచ్చింది. దీనికి మీరేం చెబుతారు?"

ఎస్సై మాటలకు డాకూ పగలబడి నవ్వాడు. "ఓ అదా మీ అనుమానం? క్షణంలో తీర్చేస్తాను" అంటూ గదిలోని స్విచ్ ఆన్ చేశాడు.

ముందు గురగుర, తరువాత గరగర, ఆ తరువాత పిండి గిర్నీలా, దాని పిమ్మట వేగంగా పనిచేసే అచ్చు యంత్రంలా భయంకరమైన శబ్దాలు చేస్తూ సీలింగ్ ఫాన్ తిరగడం మొదలు పెట్టింది.

ఫాన్ వేగాన్ని అందుకునే సరికి దాని యజమాని తప్ప అందరూ గదిలోంచి మాయమయ్యారు. ★